క్లుప్తంగా...

నేడు జాబ్ డ్రైవ్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో శనివారం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఐవాన్‌వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ జాబ్ డ్రైవ్‌లో బ్యాంకింగ్, ఎంఎన్‌సీ ఐటీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన ఆసక్తి గల ఉద్యోగార్థులు జాబ్ డ్రైవ్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో రూపాయల్లో... టమాటా 43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 23, గుండు బీన్స్ 95, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

30న జరిగే డిగ్రీ పరీక్షలు వాయిదా వేయండి


కంట్రోలర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 30న జరిగే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని పలువురు అధికారులను కోరారు. శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములుకు 30న పీజీ ప్రవేశ పరీక్షలు ఉన్నందున అదే రోజు జరిగే డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలని వినతి పత్రం సమర్పించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



లాలాపేట: ఇండియన్ రైల్వేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్(ఇరిసెట్)లో ట్రైనీ అధికారులకు శిక్షణలో భాగంగానే గత 12 రోజుల నుంచి వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెలికాం స్పోర్ట్స్ సీనియర్ ప్రొఫెసర్ సుశీల్ నామ్‌దేవ్, ఇరిసెట్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సి. చంద్రశేఖర శాస్త్రీలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇరిసెట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓయూలో ఒలింపిక్ డే రన్


ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఒలింపిక్ డే రన్‌ను వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. శుక్రవారం ఎన్‌సీసీ గేటు నుంచి ఎల్బీస్టేడియం వరకు నిర్వహించతలపెట్టిన రన్‌ను ఒలింపిక్ జ్యోతిని పట్టుకొని వీసీ పరుగు తీసి రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డా.కృష్ణ, బాబులాల్, డా.సోమేశ్వర్ రావుతో పాటు వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు.

నీటి కోసం ఆందోళన

వెంకటేశ్వరకాలనీ: నల్లాల్లో లోప్రెషర్‌తో నీరు సరిగా రావడం లేదని బస్తీవాసులు ఆందోళన చేపట్టారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్, వెంకటేశ్వరనగర్ బస్తీల్లో కొద్ది రోజులుగా లో ప్రెషర్‌తో నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని లైన్‌మెన్లకు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు శుక్రవారం బంజారాహిల్స్‌లోని తట్టిఖాన సెక్షన్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రెండు గంటలకు పైగా వదులుతున్నా సరైన ప్రెషర్‌తో రాకపోవడంతో నీరు సరిపోవడం లేదని ఈ సమస్యను కొద్ది రోజులుగా సంబంధిత అధికారులకు చెప్పినా వినిపించుకోవడం లేదని అన్నారు. తట్టిఖాన సెక్షన్ కార్యాలయం వద్ద మేనేజర్లు రాంబాబు, శివకుమార్‌లతో వాగ్వాదానికి దిగారు. అనంతరం అక్కడే ఉన్న జీఎం హరిశంకర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో జీఎం హరిశంకర్ మాట్లాడుతూ... రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వర్షాకాలం ఇబ్బందులకు తక్షణ పరిష్కారం చూపాలి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: వర్షాకాలపు ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రజల నుంచి దూరం చేయడంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ ఆదేశించారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులతో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో నాలాల్లోంచి వరద నీరు సాఫీగావెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై వరదనీరు చేరడం, చెట్లు నేల కూలడం వంటి సందర్భాల్లో తక్షణ రక్షణ చర్యలు తీసుకునేందుకు అన్ని విభాగాల అధికారులు ప్రమత్తంగా ఉండడంతోపాటు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పుష్కలంగా నిధులు ఇప్పించామని పద్మారావుగౌడ్ తెలిపారు. పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ, జలమండలి పరిధుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇటీవలే రూ. 56 కోట్ల మేర నిధులు మంజూరు చేయించామన్నారు. వీటితోపాటు నియోజకవర్గంలో చేపడుతున్న కళాశాలలు, ఆసుపత్రి, రోడ్డు అండర్ బ్రిడ్జి, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పనులను వేగవంతంచేయాలని అధికారులను సూచించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ బీ.శ్రీనివాస్‌రెడ్డి, డీసీ దశరథ్, ఈఈ ఆశాలత, జలమండలి డీజీఎం వైకృష్ణ, తహసీల్దార్లు మాధవి అయ్యప్ప, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలి


ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

రసూల్‌పురా: మంచి ఆరోగ్యానికి వ్యాయమం ఎంతో అవసరమని.. ప్రతి రోజు వాకింగ్ రన్నింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు కొనసాగే ఒలింపిక్ రన్‌ను ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్‌కుమార్, అర్జున్ అవార్డు గ్రహీత అనూప్ కుమార్ కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్, పలువురు క్రీడాకారులు, విద్యార్థులు స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ జ్యోతి చేతపట్టి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డి, ఇతర క్రీడాకారులు నేటి విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో సుధాకర్, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, జాతీయ మాస్టర్ అథ్లెట్ ప్రభుకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బీజేపీ ఇంటింటి ప్రచారం


తిరుపతిరావుకు కరపత్రాన్ని అందజేస్తున్న బండ కార్తీకరెడ్డి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బిజేపీ మహిళా నాయకులు

అడ్డగుట్ట: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి హంసరాజు అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ బిజేపీ కార్యక్రమం నిర్వహించారు. బిజేపీ నేతలు మహేందర్, వేణుగోపాల్, రాజు, మోహన్ పాల్గొన్నారు.

తార్నాకలో గడప గడపకు బీజేపీ

లాలాపేట: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రలల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో శుక్రవారం తార్నాకలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి పాల్గొన్నారు. తార్నాకలోని నాగార్జునగర్‌లో ప్రొఫెసర్ తిరుపతిరావును, స్థానిక ప్రజలను కలిసారు. మోదీ పాలనలోని విజయాలను వివరించారు. కార్యక్రమంలో బండ చంద్రారెడ్డి, అడ్వకేట్ నవీన్, రామసుబ్బారెడ్డి, సంపత్, చరణ్, రాజేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ మహిళా నాయకుల ఇంటింటి ప్రచారం

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ నేతృత్వంలో పార్టీ మహిళా నాయకులు ఇంటింటి బిజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బిజేపీ మహిళా నాయకులు నాగరాణి, మహేశ్వరి, శారద పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రిని నిర్మించాలంటూ ధర్నా


అంజయ్య విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: డివిజన్‌లో యాభై పడకల ఆస్పత్రి నిర్మించే వరకు తమ పోరాటాలు సాగుతూనే ఉంటాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అడ్డగుట్టలో యాభై పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అంజయ్య విగ్రహం వద్ద సీపీఐ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుమారు 50 వేల పైచిలుకు జనాభా ఉన్నటువంటి ఈ ప్రాంతంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ధర్నాలో సీపీఐ నాయకులు ఉమర్ఖాన్, బాబు, యాదగిరి పాల్గొన్నారు.

వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శనకు స్పందన



సికింద్రాబాద్: ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాల్‌లో ఏర్పాటు చేసిన కృతి వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేనేత ప్రదర్శన నిర్వాహకురాలు శ్రీలత యలమంచిలి మాట్లాడుతూ... వేసవి, వివాహ, ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి అనుగుణంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక కలెక్షన్స్, వివిధ రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ఆకర్షణీయమైన డిజైన్లతో పాటు నగరానికి చెందిన ప్రముఖ జ్యువెలరీ షోరూం వసుంధర జువెలర్స్ వారిచే బంగారు, వజ్రాల అభరణాలు, హైదరాబాద్ మేలిమి ముత్యాల నగలు మగువలు దోచే విధంగా ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ధరించడానికి అనువైన కాటన్ దుస్తులు, వివాహ, ప్రత్యేక సందర్భాలలో ధరించే విధంగా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌తో పాటు ఉప్పాడ, కళంకారి, మంగళగిరి, వెంకటగిరి, పోచంపల్లి చీరలు, చందేరి సిల్క్, రాజస్థాన్, హ్యాండ్ బ్లాక్ ప్రింట్ చీరలు, భగల్పూర్ సిల్క్ చీరలు, బెంగాల్ కాటన్ చీరలు, కాశ్మీర్, లక్నోచికన్ చీరలు, బనారస్ చీరలు, కాంతావర్క్ చీరలు, డిజైనర్ సూట్స్, బ్లౌజులు, జైపూర్ బెడ్ షీట్లు, బ్లాక్ గాజులు వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన మరో ఈనెల 25 వరకు మాత్రమే కొనసాగుతుందని తెలిపారు.

మహిళా కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన.. వ్యక్తికి జైలు

అడ్డగుట్ట: విధుల్లో నిర్వహిస్తున్న మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం... బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన బి. విశ్వనాథ్(36) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 22న మారేడుపల్లిలోని షెనాయ్ నర్సింగ్ హోం సిగ్నల్ దగ్గర తన ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ అతన్ని అడ్డుకుంది. దీంతో సదరు మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడి ఆమె విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు విశ్వనాథ్‌పై కేసు నమోదు చేసుకున్న తుకారాంగేట్ పోలీసులు శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఐటీ రంగంలో మెరుగైన అవకాశాలు

ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి


ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐఎంటీ హైదరాబాద్ ప్రతినిధులు

సనత్‌నగర్: ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం ద్వారా మెరుగైన అవకాశాలను అందించవచ్చని తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అన్నారు. ఐటీ నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐఎంటీ హైదరాబాద్‌లు మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ)లు కుదుర్చుకున్నాయి. బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పరస్పరం ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌కే జోషి మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐఎంటీల భాగస్వామ్యంతో భవిష్యత్తులో ఐటీ నిపుణుల కొరత తీరుతుందనే అభిప్రాయం వ్యక్తంచేశారు. తెలంగాణను సాంకేతిక హబ్‌గా మార్చడంలో ఈ ఎంవోయూ ఎంతగానో దోహదం చేయగలదన్నారు. డిజిటల్ రంగ అభివృద్ధికి మరింతగా ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ డైరెక్టర్ ఆశీష్ భల్లా, ఐఎంటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ హర్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి పలువురి నివాళి


శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కన్నాభిరాం నేతృత్వంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదం విజయ్‌కుమార్ హాజరై శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మోహన్ రావు పాల్గొన్నారు.

బౌద్ధనగర్: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారాసిగూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బిజేపీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించాలి


చేనేత హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

లాలాపేట: చేనేత హస్త కళాకారులు ఎంతో నైపుణ్యంతో తయారు చేసిన వస్త్రాలను, వస్తువులను ప్రజలందరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాకలోని ఐఐసిటి స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా మేళాను శుక్రవారం సాయంతరం ఆయన ప్రారంభించారు. స్వయంగా చేనేత వస్త్రాలను, పలు కళాఖండాలను కొనుగోలు చేశారు. చేనేత కళాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలల్లో సంస్కృతి, సాంప్రదాయలతో చేనేత హస్త కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, వస్తువులన్ని ఒకే ప్రాంతంలో నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావడంపై నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు వికాస్ జైన్ తదితరులున్నారు.



పుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి అభివాదం చేస్తున్న పద్మారావు గౌడ్

ప్రారంభమైన తార్నాక ఎఫ్‌ఓబీ

లాలాపేట: తార్నాకలోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్ ఓవర్ బ్రిడ్జి ఎట్టకేలకు ప్రారంభమైంది. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి పలువురి కార్పొరేటర్ల తో కలిసి ఎఫ్ఓబిని ప్రారంభించి దాని పై నుంచి వి ద్యార్థులు, స్థానికులతో కలిసి ఆటు ఇటు రోడ్డు దాటారు.

మంత్రి తలసాని చర్యలతో భక్తుల ఇబ్బంది

మాజీ ఎమ్మెల్యే, మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ కార్యక్రమం ముగిసాక అదే ఆవరణలోనే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బహిరంగంగా ఉమ్మి వేయడం భక్తులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసిందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆలయాలను సందర్శించడానికి కనీసం ఒకరోజు ముందుగా పొగాకు ఉత్పత్తులను నమలడం మానేయాలని మంత్రి తలసాని సూచించారని, అయితే ఆయనే ఆలయ ప్రాంగణంలో ఉమ్మివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గుట్కా వంటి నిషేధిత ఉత్పత్తులను మంత్రి వినియోగిస్తున్నాడా లేదా అనే అంశంపై దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. కళ్యాణానికి రెండు మూడు రోజులు ముందుగా అందరినీ ఆశ్చర్యపరిచేవిధంగా మూడు వైపులా షెడ్డుపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దాతగా పేర్కొంటూ పెద్ద పెద్ద బోర్డులు పెట్టారన్నారు. మంత్రి అసలు దేనికి దాత అని ప్రశ్నించారు. అమ్మవారి కళ్యాణానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ 10 కార్ల కాన్వాయ్‌తో పెద్ద ఎత్తున కుటుంబసభ్యులు, అనుచరులతో ఆలయానికి చేరుకున్నారని, దీంతో పరిమిత స్థలంలో సామాన్య ప్రజలు అసౌకర్యానికి గురయ్యారన్నారు. స్థానిక పోలీసుల దృష్టి మొత్తం వీఐపీల పైనే ఉందన్నారు.

గురునానక్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: గురునానక్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డిని కోరారు. శుక్రవారం బీసీ సంక్షేమా సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో వినతి పత్రం సమర్పించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీమ్‌పట్నం సమీపంలో గల గురునానాక్ యూనివర్సిటీ పై చర్యలు తీసుకోవాలని మంత్రి నివాసంలో వినతి పత్రం సమర్పించారు. గురునానాక్ యూనివర్సిటీకి గుర్తింపులేకున్న 3,800 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి ఫీజుల రూపేన లక్షల రూపాయాలను దండుకున్నారని తెలిపారు. విద్యార్థులను మోసగించిన గురునానాక్ వర్సిటీ యజమానుల పై క్రిమినల్ కేసును నమోదు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రవికిరణ్, వెంకన్నయాదవ్, మాధవి పాల్గొన్నారు.

పీసీబీ కార్యాలయం ముట్టడి


టీఎస్‌పీసీబీ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన వడ్డేపల్లి గ్రామ నివాసితులు

సనత్‌నగర్: సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటుచేస్తున్న సురభి లేబరేటరీస్ వల్ల పీల్చే గాలి, తాగే నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందంటూ ఆ గ్రామస్తులు పెద్ద ఎత్తున సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఒకానొక దశలో పీసీబీ కార్యాలయం లోపలికి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా సనత్‌నగర్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులకు, ఎస్ఐ మురళీగౌడ్‌కు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరకు పోలీసులు సర్దిచెప్పి 10 మందిని లోపలికి పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సురభి లేబరేటరీ యాజమాన్యం, గ్రామస్తులతో పీసీబీ బోర్డు మెంబర్స్ సమావేశమయ్యారు. ఇరువైపులా వాదోపవాదనలు విన్నారు. ఈ విషయమై టీఎస్‌పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రఘు స్పందిస్తూ సురభి లేబరేటరీ ఏర్పాటు విషయమై వడ్డేపల్లి గ్రామస్తులు తమ వాదనలు వినిపించారని, ఆ మేరకు కంపెనీ యాజమాన్యం కూడా సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లిఖితపూర్వకంగా వారి రిప్‌లైవచ్చిన తరువాత నిర్ణయం తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సనత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..కూలీ పనిచేస్తూ ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ మెట్ల వద్ద పడుకునే ఓ వ్యక్తి నిర్జీవంగా పడి ఉన్నట్లు శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు అక్కడకు చేసుకుని వ్యక్తిని పరిశీలించగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. సరైన ఆహారం లేక ఆరోగ్యం క్షీణించి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సనత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ 94906 17132, ఎస్ఐ 9490618445 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కృష్ణగౌడ్ కోరారు.

బోర్డు మాజీ సభ్యుడు ప్రభాకర్ మృతి



రసూల్‌పురా: తెలంగాణ ఉద్యమ నేత, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు బి.ప్రభాకర్ శుక్రవారం కిమ్స్ హాస్పిటల్‌లో కన్నుమూశారు. గత ఆదివారం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కిమ్స్‌లో చేరిన ప్రభాకర్ ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రభాకర్ మృతదేహాన్ని బొలంరాయి లోని ఆయన ఇంటి వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు నళిని కిరణ్, పాండుయాదవ్, శ్యాంకుమార్, భాగ్యశ్రీ, లోకనాథ్‌లు ఆసుపత్రికి చేరుకుని కుటుంబసభ్యులను ఓదార్చా రు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నా గేష్, వైద్య మౌళిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ప్రభాకర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.